## కాంగ్రెస్‌ను నమ్మితే నట్టేట మునుగుడే..



ఖానాపురం: ధరణిని రద్దు చేస్తామంటున్న కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే రైతులను నట్టేట ముంచుడు ఖాయం. ధరణి లేకముందు భూములు పట్టా చేయించుకోవడం చాలా కష్టమయ్యేది. సీఎం కేసీఆర్ ఎంతో ఆలోచించి ధరణిని తీసుకువచ్చారు. దీంతో రైతులకు చాలా మేలు చేకూరుతున్నది. దళారీ వ్యవస్థ లేకుండా రైతులు తమ భూములను నేరుగా పట్టా చేయించుకునే అవకాశం కల్పించారు. ఇది జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు ధరణిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ధరణితో రైతులందరికీ ఎంతో ఉపయోగం ఉన్నది. పాత రెవెన్యూ విధానంతో పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకువస్తే మళ్లీ రైతులం ఇబ్బందులకు గురవుతాం. ధరణిని రద్దు చేసే అవకాశం కాంగ్రెస్ నాయకులకు ఇవ్వం.

***- మలికంటి వెంకన్న, రైతు, ఖానాపురం***

## కౌలుచట్టంతో పట్టాదారులకు సమస్యలే..



చెన్నారావుపేట: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అనేక పథకాలు తీసుకొచ్చింది. 24గంటల కరెంట్, రైతుబంధు పథకాలతో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నరు. ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ ఒక అద్భుతం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కౌలు రైతుల కోసం చట్టం తీసుకొస్తామని చెప్పడం పట్టాదారుల్లో భయాన్ని కలిగిస్తున్నది. దాంతో పట్టాదారుడికి, కౌలుదారుడికి మధ్య దూరం పెరుగుతుంది. అనేక సమస్యలు తలెత్తి, కోర్టులకు వెళ్లాల్సి వస్తుంది. కౌలు ఒప్పందం చేస్తే భూమిపై హక్కు కోల్పోతామనే భయం ఉంటుంది. పట్టాదారులు వ్యవసాయం మానేస్తారు. కౌలు రైతులకు ఒప్పందం చేయడానికి ఒప్పుకోరు.

***- ఇట్టబోయిన శ్రీను, బోజెర్వు, చెన్నారావుపేట***



# ‘పెద్ది’తోనే కనీవినీ ఎరుగని అభివృద్ధి

- విద్య, వైద్య రంగాలకు పెద్దపీట
- మెడికల్ హబ్‌గా మారిన నర్సంపేట
- బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న
- ప్రచార స్టిక్కర్ల ఆవిష్కరణ



నెక్కొండలోని పార్టీ కార్యాలయంలో ప్రచార స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, పార్టీ నాయకులు

నెక్కొండ, నవంబర్ 22: ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హయాంలో నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి జరిగిందని జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న అన్నారు. బీఆర్ఎస్ పార్టీ స్థానిక కార్యాలయంలో బుధవారం ఎన్నికల ప్రచార స్టిక్కర్లను ఆవిష్కరించి మాట్లాడారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎన్నో సమస్యలను ఎమ్మెల్యే పెద్ది పరిష్కరించారని తెలిపారు. మండలంలోని పెద్దకొర్పోలు, చిన్నకొర్పోలు, నాగారం, ఇంటికన్నె గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతుంటే వట్టెవాగులపై బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. మెడికల్ కాలేజీ రావడం, వైద్య పరీక్షల కోసం ల్యాబ్ అందుబాటులోకి రావడంతో ఈ ప్రాంతం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. పేదలకు ఎలాంటి వైద్య పరీక్షలైనా ఉచితంగా చేయడంతోపాటు కొత్తగా నిర్మిస్తున్న దవాఖానతో ఎంజీఎం దవాఖానకు దీటుగా వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. ఎకరానికి రూ.10వేల చొప్పున రైతులకు పంట నష్టపరిహారాలు అందజేసినట్లు తెలిపారు. కరోనా సమయంలో పేదలకు వైద్యసాయం అందించే ఏర్పాట్లు చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడినట్లు పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉండే ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిచేందుకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని సూచించారు. ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్రంలో ఎక్కడా లేని పథకాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకువచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే పెద్ది అవకాశం వచ్చిన తక్కువ సమయంలోనే ఈ అభివృద్ధి చేశారని, ప్రజలందరూ పెద్దిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ జాటోత్ రమేశ్, నెక్కొండ సొసైటీ చైర్మన్ మారం రాము, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, మండల ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనిజేటి భిక్షపతి, సీనియర్ నాయకులు చల్లా చెన్నకేశవ రెడ్డి, మండల నాయకులు అన్నమనేని సంతోశ్, హెచ్ శ్రీను, మాతంగి రాజు, తోట సాంబయ్య, ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య పాల్గొన్నారు.

## వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

ఖానాపురం, నవంబర్ 22: బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం పార్టీ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే పెద్దిపై కాంగ్రెస్ అభ్యర్థి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండిపడ్డారు. గత ఏడాది కొత్తూరులో గాలివాన బీభత్సానికి కోట్లాది రూపాయల పంట నష్టం జరిగినప్పుడు రైతులను పరామర్శించని మాధవరెడ్డి కొత్తూరు ప్రజల ఓట్లు అడగడానికి ఏ ముఖం పెట్టుకుని వచ్చాడని ప్రశ్నించారు. కరోనా కష్టకాలంలో ప్రజలను ఆయన ఆదుకోలేదని, నాలుగేళ్లుగా ముఖం చూపని ఆయన ప్రజలను ఓటు అడిగే అర్హత లేదన్నారు. పాకాలకు గోదావరి జలాలను తీసుకువచ్చిన పెద్దిని ఎన్నికల ప్రచారంలో విమర్శించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. పాకాల చివరి ఆయకట్టుకు నీరందకపోవడానికి కారకుడే మాధవరెడ్డే అని చెప్పారు. నాడు కమీషన్లకు కక్కుర్తి పడటం వల్లే నేడు రైతులకు కష్టాలు తప్పడం లేదన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై దాడులకు దిగుతున్నారన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, జాటోత్ బాలునాయక్, శౌంఠి లక్ష్మణ్, బాలునాయక్, తక్కళ్లపల్లి బాబురావు, అశోక్, బూస అశోక్, రమేశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

## బాల్యవివాహాలను నిరోధించాలి

నెక్కొండ, నవంబర్ 22: బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలను నిరోధించాలని అప్పల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ అన్నారు. గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఎఫ్ఎంఎం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా క్రూరమైన చర్య అన్నారు. అపరిచిత వ్యక్తుల మాయమాటలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల్య వివాహాల ప్రయత్నాలను నిరోధించాలని కోరారు. ఎఫ్ఎంఎం సొసైటీ ఫీల్డ్ కోఆర్డినేటర్ ప్రభాకర్ మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలల అక్రమ రవాణాపై ముద్రించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు రవీంద్రనాథ్, గీత, యాకయ్య, శ్యాంసుందర్, గోపాల్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

## నేడు మండల సర్వ సభ్య సమావేశం

నర్సంపేట రూరల్, నవంబర్ 22: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నర్సంపేట మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అంబాల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ మోతె కళావతి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు ఆయా శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో సకాలంలో రావాలని సూచించారు. ఎంపీవో అంబటి సునిల్‌కుమార్‌రాజ్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు సంతోశ్ బాబు, కొండల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి అన్నారు.



చెన్నారావుపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో బుధవారం స్వయంపరిపాలనా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

# కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజలు నమ్మొద్దు

- బీఆర్ఎస్ నాయకులు
- ‘పెద్ది’ తరఫున విస్తృత ప్రచారం



నర్సంపేట రూరల్ : ఇటుకాలపల్లి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

నర్సంపేట, నవంబర్ 22: కాంగ్రెస్ పార్టీ ఇస్తున్న గ్యారెంటీలన్నీ అబద్ధాలేనని, వాటిని ప్రజలు నమ్మొద్దని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకట నారాయణ గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జి నల్లా మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ నాయకులు అమలుకు సాధ్యం కాని హామీలను ఇస్తున్నారని, వారిని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను పొందిన వారు ప్రతి ఇంట్లో ఉన్నారని తెలిపారు. ప్రజలందరూ సీఎం కేసీఆర్‌కు అండగా ఉన్నారన్నారు. నర్సంపేటలో ఎమ్మెల్యే పెద్దితోనే అభివృద్ధి సాధ్యమైందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చారని పేర్కొన్నారు. ప్రజలు మళ్లీ ఎమ్మెల్యే పెద్దిని గెలిపించాలని కోరారు. కౌన్సిలర్ నాగిశెట్టి పద్మా ప్రసాద్, దార్ల రమాదేవి, ఎస్కే ఇర్ఫాన్, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం..

నర్సంపేట రూరల్: బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలు బుధవారం ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. నర్సింగాపురంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు భూక్య వీరన్న, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, ముఖ్య నాయకులు కందగట్ల నరేందర్, రమేశ్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పోస్టర్లను చూపుతూ పెద్దిని గెలిపించాలని కోరారు. ఇటుకాలపల్లిలో సర్పంచ్ మండల రవీందర్, ఉప సర్పంచ్ జమాండ్ల చంద్రమౌళి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, వినయ్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. పట్టణంలోని సర్వాపురం 4వ వార్డులో గడప గడపకు బీఆర్ఎస్ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు సంపంగి సాలయ్య, ముఖ్య నాయకులు రాపోలు వెంకటస్వామి, రాపోలు శ్రీను, సమ్మయ్య, నాగేంద్రబాబు, నాగరాజు, మురళి, సంపత్, కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రచారం జరిగింది. రాజుపేటలో ముఖ్యనాయకులు రమేశ్, రాజు, సాంబయ్య, సురేశ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.



నర్సంపేట: ప్రచారంలో వెంకటనారాయణగౌడ్



నర్సంపేట: ప్రచారం చేస్తున్న కౌన్సిలర్ పద్మా ప్రసాద్



నర్సంపేట రూరల్ : నర్సింగాపురంలో..



నర్సంపేట రూరల్ : రాజుపేటలో..